క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి
చేవెళ్ల డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి



మొక్క నాటిన డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని చేవెళ్ల డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో 'నాటుదాం మొక్క అమ్మ పేరు మీద' అనే కార్యక్రమాన్ని హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సతీష్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



మాచన్‌పల్లి గ్రామంలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

షాబాద్: కృష్ణాష్టమి వేడుకలను షాబాద్ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. షాబాద్, మాచన్‌పల్లి తదితర గ్రామాల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు వారి ఇంటి వద్దనే చిన్నారులను కృష్ణుడు, గోపికలుగా తయారు చేశారు. అనంతరం వారు నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు సహాయం అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన బుర్రముని బాలయ్య అకాల మృతి చెందాడు. మృతుడిది పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, గుండ్రాతి రమణయ్యగౌడ్‌లు ఐదు వేల చొప్పున, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి మూడువేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పిల్లి అమరేష్, పాండుగౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, బైకని శేఖర్, మంచెపాండు, పోలేమోని సతీష్, ఉడుత హరి, మంగళి ఆనంద్, తలసాని ప్రవీణ్, పిల్లిరవి, అమ్రేష్, దండే రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి
జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్

నందిగామ: ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ డిమాండ్ చేశారు. నందిగామలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15లోపు రూ.2 లక్షల వరకూ ఉన్న రుణాలను మాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రభుత్వం పలు ఆంక్షల పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికే చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులరుణాలను మాఫీ చేయాలని కోరారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



లేమూరులో నూతన బస్సుకు పూజలు చేసి ప్రారంభిస్తున్న అధికారులు, గ్రామస్తులు

కందుకూరు: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లేమూరు మాజీ సర్పంచులు జి.కొండారెడ్డి, ఢిల్లీ గణేష్ కోరారు. మిథాని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసును ఉమెన్స్ కాలేజ్ నుంచి లేమూరు వరకూ రోజూ మూడు ట్రిప్పులు తిరిగేలా అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం మండల పరిధిలోని లేమూరుకు నూతనంగా వచ్చిన ఆ సర్వీసు బస్సును గ్రామస్తులతో కలిసి వారు పూజలు చేసి ప్రారంభించారు. గుర్వి జైపాల్, మల్లేష్, గుర్వి యాదయ్య, కదారి గణేష్, ఎన్.మల్లేష్, సీహెచ్ కృష్ణ, కె.పొన్నమ్మ, కె.శైలజ, కె.రాములమ్మ, గుర్వి జంగయ్య పాల్గొన్నారు.



అంతారంలో పత్తి పంట




బోడంపహాడ్‌లో పచ్చగా కనిపిస్తున్న మొక్కజొన్న

'ఆరుతడి' కళకళ

- ఏపుగా పెరిగిన పత్తి పంట
- గట్టెక్కిన కంది, మొక్కజొన్న, జొన్న
- ఆనందంలో రైతన్నలు

షాబాద్: ఆడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలు కళకళ లాడుతున్నాయి. షాబాద్ మండల పరిధిలోని రైతులు పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, వరి పంటలను మెట్టపొలాల్లో వర్షాధారం కింద సాగు చేశారు. ఆగస్టు ప్రారంభం నుంచి వర్షాలు కురవడంతో ఆరుతడి పంటలకు జీవం వచ్చినట్లయింది. పత్తి పంటలు బాగా ఏపుగా పెరిగాయి. జొన్న, కంది, మొక్కజొన్న, వరి, తదితర పంటలన్నీ పచ్చగా ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలు ఆరుతడి పంటలకు ఊపిరిలూదాయి.



తాళ్లపల్లి గ్రామంలో వరి



మద్దూరులో జొన్న సాగు

పెరిగిన పత్తి సాగు...

షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్, మల్లారెడ్డిగూడ, మరియాపురం, ముద్దెంగూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, మక్తగూడ, ఏట్ల ఎర్రవల్లి, నాగర్‌గూడ, పోతుగల్, అంతారం, కక్కులూరు, మన్మర్రి తదితర గ్రామాల్లో పత్తి పంటలు దాదాపు 15వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. కంది పదిహేను వందల ఎకరాల్లో, జొన్న ఐదు వందల ఎకరాల్లో, మొక్కజొన్న 15వేల ఎకరాల్లో సాగైందని సంబంధిత అధికారులు తెలిపారు.

3500 ఎకరాల్లో వరి...

షాబాద్ మండలంలో వ్యవసాయ బోర్ల కింద వరి పంటల సాగు జోరుగా ఉంది. రైతులు దాదాపు 3500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు.

సమయానుకూలంగా నడపాలి



బస్టాండ్‌లో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్: ఆర్టీసీ బస్సులను సమయానుకూలంగా నడపాలని ఈ విషయంలో ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామాలకు సరైన సమయానికి బస్సులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు కళాశాలలకు, పాఠశాలలకు సరైన సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అధ్యాపకులు బోధించే పాఠాలను వినలేకపోతున్నామన్నారు. నందిగామ పరిధిలో బస్సులను సరిగా ఆపడం లేదన్నారు. ఈ విషయంలో డిపో మేనేజర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యులు భగత్, మానస, లహరి, సాత్విక, శాలిని, తరుణ్, ఆకాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండల పరిధి వివిధ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాలో విద్యుత్ అంతరాయం కలగనుందని ఏఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కందుకూరు టౌన్–2, 11కేవీ దెబ్బడగూడ ఏజీఎల్ ఫీడర్ల పరిధిలోని 33కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ దెబ్బడగూడ ఏజీఎల్, 11కేవీ మహ్మద్‌నగర్ ఫీడర్ల పరిధిలో, 11కేవీ నేదునూరుటౌన్, మాన్యగూడ, అలీఖాన్‌పల్లి ఫీడర్లలో కొత్త సర్వీసుల పని నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని వెల్లడించారు. 11కేవీ రాచులూరు టౌన్, ఏవీఆర్ ఫీడర్లలో లైన్ షిఫ్టింగ్‌ల నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ ఎల్.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్, హార్డ్‌వేర్ పార్కు–2, ముదిరాజ్ కాలనీ, ఉమర్ కాలనీ, అబ్బుషేర్ కాలనీల్లో సరఫరాను నిలివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతు ధర్నాలో రాజకీయ నిరుద్యోగులే
మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్‌ఎస్ రాజకీయ నిరుద్యోగులే తప్పా రైతులు పాల్గొనలేదని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకు 10 ఏళ్లు రైతులు గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కేటీఆర్‌కు రైతులు గుర్తొచ్చారని విమర్శించారు. రైతు రుణాలను రూ.2లక్షల వరకు తప్పకుండా ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని హామీలను పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రామిడి కృష్ణారెడ్డి, సోనునాయక్, వెంకటేష్‌గౌడ్, రామేష్‌నాయక్, నవీన్, నరేష్, జంగయ్యగౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన అవసరం

ఎన్టీఆర్ విద్యా సంస్థల డీన్ డాక్టర్ ఎంవీ రామారావు



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపక బృందం

మొయినాబాద్‌రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను నిర్మూలించేందుకు మహిళలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ విద్యా సంస్థల డీన్ డాక్టర్ ఎంవీ రామారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో ఎన్టీఆర్ విద్యా సంస్థల విద్యార్థినులు, అధ్యాపకులు అత్యాచారాలను నిరసిస్తూ హిమాయత్‌నగర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ముందు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కోల్‌కత్తలో అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వీజే రెడ్డి, అధ్యాపకులు రాజ్‌దీప్, అరుణ, సౌమ్యలక్ష్మి, జాహ్నవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ

మహేశ్వరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లకు వారి కేంద్రానికి సంబంధించి ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తినేలా ప్రోత్సహించాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని, ఫ్రీగా స్కూల్ మెటీరియల్‌ను చిన్నారులకు అందజేయాలని సూచించారు. పట్టిక ప్రకారం పిల్లల బరువు, ఎత్తు కొలవాలని చెప్పారు. అంతకు ముందు పూర్వ ప్రాథమిక విద్య, టైమ్ టెబుల్‌ను వివరించారు. ఎంపీడీఓ శైలజ, దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ అధికారి డా.మల్లికార్జున్, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని నిరసన

కందుకూరు: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు ఎండీ బషీర్ మాట్లాడారు. సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. జీఓ నంబర్ 28ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్‌రెడ్డి, సురేష్, గ్లోరీ, కౌసల్య, ఎండీ అబ్దుల్లా, కరుణాకర్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

మీర్‌పేట: ఆపదలో ఉన్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ ఓల్డ్ బాలాజీనగర్‌కు చెందిన శ్యామ్‌రావు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు లక్షల్లో డబ్బు కావాల్సి ఉంది. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు బాలకిషన్ ద్వారా ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని శ్యామ్‌రావుకు ఎమ్మెల్సీ అందజేశారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గులో మినీ స్టేడియం ఏర్పాటునకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కొందుర్గు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని దీనికోసం అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీస్టేడియం ఏర్పాటునకు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. కొందుర్గు తూర్పు శివారులోని సర్వే నెంబర్ 19లో 10 ఎకరాలు మినీస్టేడియం ఏర్పాటునకు, కొందుర్గు పడమర శివారు సర్వే నెంబర్ 109లో 20 ఎకరాలు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటునకు స్థలాలను చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందుర్గు మారుమూల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. షాద్‌నగర్–పరిగి రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరణ చేస్తామన్నారు. అదేవిధంగా స్థలం అందుబాటులో ఉంటే 10 ఎకరాల్లో పేదలకు మోడ్రన్ కాలనీ నిర్మిస్తామన్నారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ కుమార్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, యాదయ్య, రామయ్య గౌడ్, గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్, నరేందర్, కృష్ణయ్య, చంద్రశేఖర్, మానయ్య, రామస్వామి, జీబీ కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

హరే కృష్ణ మూమెంట్ హైదరాబాద్ స్వామి సహదేవ్



మాట్లాడుతున్న స్వామి సహదేవ్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే తప్పనిసరిగా రాణిస్తారని హరే కృష్ణ మూమెంట్ హైదరాబాద్ స్వామి సహదేవ్ పేర్కొన్నారు. మండల పరిధిలో అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్‌ఈసీ కళాశాలలో ఓరియంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉన్నత విద్యలో విద్యార్థులు బాగా చదివి తమ జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. అనంతరం జేబీఆర్‌ఈసీ సంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ గాయత్రి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా నాణ్యమైన విద్య అభ్యసించేలా తగిన సలహా, సూచనలు చేస్తూ, సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థల డైరెక్టర్ ఏఆర్‌జే గాయత్రి, ప్రిన్సిపాల్ పి.వెంకటరమణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణ్‌మూర్తి, పవన్‌కుమార్ అల్లూరు, రవికుమార్, అబ్దుల్ రహీం, ప్రసాద్, శేశగిరి, గోవర్ధన్, ప్రభాకర్, జోష్న, నవీన్, రమేష్, డాక్టర్ రాంరెడ్డి, బాబు, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నర్సింలు తదితరులు

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి లక్ష్మీ శ్రీనివాస సమేత ప్రతిమలతో కూడిన ద్వారాన్ని దాత ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం బక్కని నర్సింలు మాట్లాడుతూ సమాజంలో ముక్తికి మార్గం వైకుంఠ ద్వారమని తెలిపారు. అందుకు ముక్కోటి వైకుంఠ ఏకాదశిన ఈ మార్గం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దండు వాసు, పాతూరి వెంకట్‌రావు, యాదవాచారి, జగన్‌మోహన్‌రెడ్డి, కంచి రాజ్‌గోపాల్, వెంకట్‌రాంరెడ్డి, కానుగు అంతయ్య, కిషన్, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఖాజాపాషా, లక్కాకుల రమేష్, రాఘవేందర్‌గౌడ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు తప్పనిసరి

మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, పీఈటీలు

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలను తప్పనిసరిగా నేర్చుకోవాలని మండల విద్యాధికారి అక్బర్ పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో శుక్రవారం జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు (అండర్ 14, 17 సంవత్సరాలు కలిగిన) జోనల్‌స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని చెప్పారు. క్రీడల్లో ఆసక్తి గల విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇవి ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యాయులు సామాజిక వేత్త ఆశీర్వాదం, వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు, సీఆర్పీ, క్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కానరాని సూచిక బోర్డులు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చెట్ల మధ్యలో సూచిక బోర్డు

నందిగామ: రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ అక్కడ చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో వాటి మధ్య సూచికబోర్డులు ఉండడంతో వాహనదారులకు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోడ్డులో ఎక్కడ మూల మలుపు, స్పీడ్ బ్రేకర్, బ్రిడ్జి ఉందో తెలియని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. నందిగామ నుంచి బైపాస్‌కు వెళ్లే మేకగూడ రోడ్డులో సూచిక బోర్డులు ముళ్ల పొదల్లో కనిపిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.

పార్టీ కోసం పని చేస్తే గుర్తింపు
రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు భీమ్‌భరత్ తదితరులు

మొయినాబాద్ రూరల్: పార్టీ కోసం పని చేసే వారికి కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తిస్తుందని రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హిమాయత్‌నగర్‌ను సందర్శించారు. చైర్మన్‌గా ఎంపికైన అనంతరం మొయినాబాద్ మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసే వారికి పదవులు వాటంతటవే వస్తాయన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్‌భరత్, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, పొల్యూషన్ కంట్రోల్ సభ్యులు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మాణయ్య, మర్రి రవీందర్‌రెడ్డి, తోల్‌కట్ట సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.